

ఎగిరి పోయాయి. ఏదో కావాలన్న తపన ఆమె లోనూ అస్పష్టంగా కదులుతోంది. ఆమె చేతులు, ఆమెకే తెలియకుండా... అతని వీపు మీద అల్లుకు పోతుంటే... అలాగే నేలమీద వాల్చాడామెను. మొజాయిక్ ఫ్లోర్ వాళ్ళిద్దరికీ స్వాగతం పలికింది. సరిగ్గా పదిహేను నిమిషాల తరువాత తెలిసింది వాళ్ళకు- 'జరగరాని దారుణం' జరిగి పోయిందన్న చేదు(?) వాస్తవం!

21-9-89
రాత్రి 9-30
డియర్ దివ్యా,

మొన్నరాత్రి ఊహించని సంఘటన నొకటి జరిగిందిక్కడ. ఆ వేళ సాయంత్రం ఆఫీస్‌నుంచి ఇంటికి రాగానే రూమ్ కొచ్చి పడుకున్నా. పెద్దగా వర్షం కురుస్తోందప్పుడు. విపరీతమైన గాలి. టైము తొమ్మిది కావస్తున్నప్పుడు - కరెంట్ పోయింది. కొవ్వొత్తి వెలిగించుదామని చూస్తే అగ్గిపెట్టె లేదు. ఇంటి వోనర్స్‌నడిగి తేవాలని వెళ్ళాను. కానీ, వాళ్ళ ఇంటిలోనూ చీకటే! ఆమె (వోనరు భార్య) ఒక్కతే ఉందప్పుడు ఇంట్లో. ఆమె కూడా అగ్గిపెట్టె కనపడక వెదుకులాడుతోంది. ఆ చీకట్లో అలా వెతుకుతు న్నట్టుగా నటిస్తూ నన్ను పట్టుకుని కౌగి లించుకుంది. ఉలిక్కిపడ్డాను. ఆమె ఉద్దేశం అర్థమై,విదిలించుకుంటుంటే "ఆయిన ఈ రాత్రికి రారు. కేంప్ కెళ్ళారు. తలుపేసెయ్యండి" అంటూ ఇంకా పెన వేసుకుపోయింది. మన పెళ్ళినాటి రాత్రి నువ్వు నాతో చేయించుకున్న ప్రమాణం గుర్తొచ్చింది. 'ఏ అమ్మాయితోనూ, ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇల్లిసిట్ సెక్సువల్ కాంటాక్ట్స్ పెట్టుకోను' అని నీ మీద ఒట్టు పెట్టుకోకుంటే... ఆమె ప్రొవొకేషన్‌కి లొంగి పోయేవాడినేనేమో!! అసలు స్త్రీ జాతిలో అంత దిగజారుడు తనం వుంటుందని నేనేనాడూ ఊహించ లేదు. అతి పవిత్రమైన వివాహ బంధానికి మచ్చ తెస్తూ, తాళికట్టిన భర్తని ఓ "కక్- వోల్డ్"గా మార్చే ఈ ఇన్-ఫిడెలిటీల కాలుష్యంతో స్త్రీ జాతి "పవిత్రత" పతనమై పోతుందా అన్న ఆలోచనలతో మనసులో బాధగా అనిపించిందారోజంతా!

నేనింక ఈ రూమ్‌లో వుండాలనుకో వడం లేదు. త్వరలో మరో చోట వేరే గదేదైనా చూసుకుని వెళ్ళి పోతాను.

నీ
తరుణ్

భార్యకు వ్రాసిన ఉత్తరాన్ని మళ్ళీ ఒక సారి చదివాడు తరుణ్. అంతవరకూ మనసు పొరల్లో ఎక్కడో లీలగా కదులు తున్న గిల్టీ ఫీలింగ్ పూర్తిగా మాయమై పోయింద తన్లో!!

** ** **

దాదాపు సరిగ్గా అదే సమయానికి బెడ్రూమ్‌లో కసిగా తనను కౌగిలించు కుంటున్న భర్త చేతుల్లో ఇమిడి పోతూ గాయత్రి చెప్పింది "ఏమండీ... మనపై గదిలో అద్దెకుంటున్న అబ్బాయ్ తరుణ్ లేడూ... మొన్నరాత్రి మీర్లేకుండా చూసి అగ్గిపెట్టె వుందా అంటూ చొరవగా ఇంట్లోకొచ్చేసి నాతో అసభ్యంగా ప్రవర్తిం చబోయాడు. ఛెళ్ళున చెంపలెండూ వాయించి, గట్టిగా బుద్ధి చెప్పాను. గది ఖాళీ చేయించెయ్యండి"

ఆ మాటలు విన్న ఏ భర్తైనా ఎలా రియాక్టవుతాడో అలాగే రియాక్టయ్యాడు గాయత్రి భర్తకూడా!! భర్తకు ద్రోహం చేశానన్న అపరాధ భావం, ఆ తరువాత ఆమెను వేధించలేదు!!

** ** **

మానవ జీవితాలకు ఆ దేవుడిచ్చిన ఓ గొప్ప వరం. 'అబద్ధం'!! ది విల్ ఫుల్ సప్రెషన్ ఆఫ్ ట్రూత్!!

# కాలక్షేపం

'హల్లో!

"హల్లో! ఎవరు కావాలండి మీకు."

"అది 63531 నెంబరేనాండి. నేను ఆది శేషయ్యను."

"అవునండి. మీకు ఎవరు కావాలి?"

"శంకరంగారు కావాలండి."

"శంకరంగారు మా నాన్నగారండి. ఊరెళ్ళారండి."

"అయ్యయ్యో నాకు చెప్పనేలేదే!"

"మాకూ చెప్పలేదండి. కోపగించి చెప్పకుండా వెళ్ళిపోయారు."

"అడిగానని అనుకోకువాయనా! ఎందుకు వెళ్ళిపోయారు?"

"ఇంట్లో ఆయనకు తోచక ఏదో గొడవ లేపుతారండి."

"తోచక అని నీవే అంటున్నావు కదా! ఆయనా, నేను రిటైర్ అయినవాళ్ళం. పైగా ఏవో జబ్బులున్న వాళ్ళం."




"అది నిజమేననుకోండి. అది మా తప్పు కాదు కదా! నేను, నా భార్య ఉద్యోగాలకు వెళ్ళిపోతాం. చాలీ చాలని జీతాలు. పిల్లలను చూసుకోవాలి, పెళ్ళయిన చెల్లెళ్ళ పురిటి ఖర్చులో, పండగ ఖర్చులో భరించు కోవాలి. ఇవన్నీ ఆయన ఆలోచించాలి కదండి."

"రిటైర్ అయి మీకు భారంగా వున్న ఆయన ఏం ఆలోచిస్తారు?"

"ఏం ఆలోచించకే రోజూ ఏమీ తోచదు అంటూ ఏనేవో తెలియని నెంబర్లకు ఫోన్లు చేసి ఉత్తుత్తి కబుర్లు మాట్లాడి..."

"దాని వలన ఆయనకూ కాలక్షేపం, ఇటు వాలాంటి వాళ్ళకూ కాలక్షేపం అవుతుందిగాని, నష్టం కాదుగా."

"ఎందుకు నష్టం కాదండి. ఈ రోజుల్లో అన్ని ధరలతోపాటు టెలిఫోన్ ధరలూ పెరిగాయిగా. ఆయన చేసే కాలక్షేపానికి, నాకు నెలకు అయ్యే బిల్లు అయిదు వందలు."

"నిజంగా!"

"నిజంగానండి. ఆ అయిదు వందలు సంపాదించి అప్పుడు ఫోన్ చేయమన్నాను. కోపం వచ్చి వెళ్ళి పోయారు."

ఆ తరువాత ఆదిశేషయ్య టెలిఫోన్ ఖర్చులకు మెల్లగా ట్యూషన్లు మొదలుపెట్టాడు. ఇప్పుడాయనకు ఫోన్ చేయుడానికి తీరికా లేదు, అనారోగ్యమూ లేదు.

—'రాధిక'

